సాక్షి సిద్దిపేట

బుధవారం । 19 । మార్చి । 2025



దివ్యాంగులకు గుర్తింపు

వైకల్య శాతాన్ని బట్టి ఇప్పటివరకు జారీ చేస్తున్న సదరం ధ్రువపత్రాలకు ప్రభుత్వం స్వస్తి పలకనుంది. వివరాలు 8లో ▸



పొలాలకు రోడ్డు వేయండి

పంట పొలాలకు వెళ్లాలంటే రోడ్డు సౌకర్యం సరిగా లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధవారం	గురువారం
సా. 6.32 గం.	ఉ. 4.59 గం.

న్యూస్‌రీల్

మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ విశ్వనాథశర్మ, వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): నాచగిరి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మాజీ సీఎం కేసీఆర్‌కు మంగళవారం నాచగిరి ఆలయ ఈఓ విశ్వనాథ శర్మ ఆహ్వాన పత్రిక అందజేశారు. వేదపండితుల మహదాశీర్వచనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

మంత్రి కొండా సురేఖకు..



మంత్రి కొండా సురేఖకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాచగిరి ఈఓ

రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను నాచగిరి స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ డీసీసీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డితో కలిసి ఆలయ ఈఓ ఉత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. దపండితులు మంత్రికి మహదాశీర్వచనం చేసి, ప్రసాదం అందజేశారు.

పరీక్షలంటే భయం వద్దు



రికార్డులను పరిశీలిస్తున్న దుర్గాప్రసాద్

దుబ్బాకటౌన్: పదోతరగతి విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా, ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలంగాణ మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ సూచించారు. మండలంలోని లచ్చపేట మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలపై దృష్టి సారించాలన్నారు. ఇటీవల సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థి హర్షవర్ధన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా బెజ్జంకి యువకుడు



చంద్రశేఖర్

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన హాస్టల్ వెల్ఫేర్ అధికారుల నియామకాలకు బెజ్జంకి యువకుడు జడల చంద్రశేఖర్ ఎంపికయ్యారు. టీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలలో రాష్ట్రస్థాయిలో 184వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 24వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను గ్రామస్తులు, యువకులు అభినందించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక



రికార్డులు పరిశీలిస్తున్న రాధిక

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎరువులను అధిక ధరలకు విక్రయించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక హెచ్చరించారు. స్థానిక ఎరువుల దుకాణాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని, కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అనంతరం పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆమె వెంట మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు ఉన్నారు.

12 మంది డిబార్

కోహెడ(హుస్నాబాద్): ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమైన పదిరోజులలో జిల్లా వ్యాప్తంగా 12 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని డీఐఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలో భాగంగా ఐదుగురు విద్యార్థులు కాపీ కొడుతూ పట్టుబడినట్లు చెప్పారు.

ఆయమ్మ.. టీచరమ్మ!

దౌల్తాబాద్ మండలం గాజులపల్లి అంగన్‌వాడీ సెంటర్- 2లో కొన్ని నెలలుగా టీచర్ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో ఆయా మంజులనే అన్నీ తానై విధులు నిర్వర్తిస్తోంది. ప్రతిరోజు పిల్లలను తీసుకురావడం, కేంద్రాన్ని నిర్వహించడం ఆమె పనిగా మారింది. ఆరోగ్యం బాగా లేకున్నా ఆస్పత్రికి పోలేని పరిస్థితి ఉందని, టీచర్ పోస్టు వెంటనే భర్తీచేసి ఇబ్బందులను తొలగించాలని ఆమె వాపోతోంది.

పోస్టుల ఖాళీలతో అవస్థలు



గాజులపల్లి అంగన్‌వాడీ సెంటర్- 2లో చిన్నారులతో ఆయా మంజుల

- 93 టీచర్లు, 364 ఆయాల ఉద్యోగ ఖాళీలు
- ఉన్నవారిపై అదనపు భారం
- గర్భిణులు, చిన్నారులకు అందని పౌష్టికాహారం

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ల, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో చాలా కేంద్రాలలో టీచర్లే ఆయాలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీచర్ల కొరతతో చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్య అందడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉండే ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,150 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 93 టీచర్లు, 364 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సలహాలు, సూచనలు లేవు..

అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురికాకుండా, శారీరకంగా బలహీనం కాకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డుతో పాటు ఆకు కూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. టీచర్‌లు లేని కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సలహాలు, సూచనలు సరిగా అందడం లేదు. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.



- సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచప్యాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో 11 సంవత్సరాలుగా అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏడుగురు గర్భిణులు, 23 మంది చిన్నారులున్నారు. వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు ఇచ్చేవారు కరువయ్యారు.

గజ్వేల్‌లోనే అధికంగా ఖాళీలు

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు 93, ఆయాలు 364 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో గజ్వేల్ ప్రాజెక్ట్ పరిధిలోనే ఎక్కువగా ఖాళీలున్నాయి. ఖాళీలు ఉన్న చోట్ల అటు ఆయాలు, ఇటు టీచర్లపై అధిక భారం పడుతోంది. కొన్ని చోట్ల పక్కనే ఉన్న కేంద్రాలలోని టీచర్లకు బాధ్యతలు అప్పగించడంతో వారిపై అదనంగా పనిభారం పడుతోంది. ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లకు ప్రభుత్వంకు సంబంధించిన ఏదైన పనులు అప్పగిస్తే ఆ రోజు కేంద్రాలు మూతబడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

ప్రాజెక్ట్	టీచర్ల ఖాళీలు	ఆయాల ఖాళీలు
దుబ్బాక	06	42
సిద్దిపేట	11	74
చేర్యాల	11	51
గజ్వేల్	41	118
హుస్నాబాద్	24	79

త్వరలోనే భర్తీ



జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు సంబంధించి వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. త్వరలోభర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇందు కోసం ఖాళీగా ఉన్న వివరాలను పంపించాం.

-లక్ష్మీకాంత్ రెడ్డి, డీబ్ల్యూఓ

- అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయానే టీచరమ్మగా కొనసాగుతోంది. నాలుగేళ్ల క్రితం టీచర్ మృతి చెందడంతో అప్పటి నుంచి ఆయా మాత్రమే ఉంది. ప్రస్తుతం 9 మంది చిన్నారులు, ఆరుగురు గర్భిణులు, 8 మంది బాలింతలు ఉన్నారు. టీచర్ ఉన్నప్పుడు దాదాపు 22 మంది చిన్నారులు వచ్చేవారు. టీచర్ లేకపోవడంతో స్థానికులు పిల్లలను పంపించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. టీచర్ లేకపోవడంతో చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, త్వరగా టీచర్‌ను నియమించాలని ఆయా కోరుతోంది.





- చిన్నకోడూరు గోనెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 26 మంది చిన్నారులున్నారు. రెండేళ్లగా టీచర్‌పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో ఆ చిన్నారులను ప్రీ ప్రైమరీ కోసం మరో అంగన్‌వాడీ కేంద్రా నికి పంపిస్తున్నారు. పౌష్టికాహారం గోనెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోనే అందిస్తున్నారు.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్: పదోతరగతి విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండి పరీక్షలకు సిద్ధమైతేనే ఉత్తమ ఫలితాలు సాధించగలరని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని బూర్గుపల్లి ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ, టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంగ్లిష్ ల్యాబ్, లైబ్రరీని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రఫీక్, అర్జున్, కవిత, ప్రసన్నలక్ష్మి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్/కొండపాక(గజ్వేల్): జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల బాలుర, బాలికల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా డీసీఓ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి 2025 ఆగస్టు 31 నాటికి 12యేళ్లలోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మరో రెండేళ్ల మినహాయింపు ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు రూ.లక్షా 50 వేలు, పట్టణ ప్రాంత విద్యార్థులు రూ.2 లక్షల ఆదాయ పరిమితి మించ కూడదని, ఆసక్తిగల విద్యార్థులు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 15 నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు https://mjptbewreir.teanfana.gov.inను సంప్రదించాలని సూచించారు.

మల్లన్న ఆదాయం రూ.68.46 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో తొమ్మిదో ఆదివారానికి గాను మూడు రోజుల ఆదాయం రూ.68,46,587లు వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. శనివారం రూ.14,28,446; ఆదివారం రూ.48,13,753, సోమవారం రూ.06,04,338తో కలపి మొత్తం మూడు రోజులకు ఈ ఆదాయం సమకూరిందని తెలిపారు. మొక్కుబడులు, దర్శ నాలు, లడ్డూ ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం సమాకూరినట్లు తెలిపారు.

బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలు

ముస్తాబైన నాచగిరి క్షేత్రం

- నేటి నుంచి శ్రీలక్ష్మీనృసింహస్వామివారి వేడుకలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



గుహలో వెలసిన శ్రీలక్ష్మీనారసింహులు

వర్గల్(గజ్వేల్): హరిద్రనది పరవళ్లు, ప్రకృతి రమణీయతలతో అలరారే సహజసిద్ధ కొండగుహల్లో స్వయంభుగా శ్రీలక్ష్మీనారసింహుడు కొలువుదీరిన భవ్యక్షేత్రం నాచారం గుట్ట నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం. మండలంలోని నాచగిరి క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శ్రీ క్రోధి నామ సంవత్సర పాల్గుణ బహుళ పంచమి బుధవారం 11వ తేదీ నుంచి శ్రీవిశ్వావసు నామ చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం 30 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

హైదరాబాదుకు చేరువలో..

హైదరాబాదుకు 55 కిలోమీటర్లు, 44వ నెంబర్ జాతీయ రహదారి తూప్రాన్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలో నాచగిరి ఉంటుంది. సికింద్రాబాద్ నుంచి ప్రజ్ఞాపూర్ మీదుగా కూడా నాచగిరికి చేరుకోవచ్చు. నాచగిరి క్షేత్రానికి ఆర్టీసీ సౌకర్యం ఉంది.


ఆకర్షణీయంగా..

ఉత్సవాలను పురస్కరించుకొని ప్రధాన ఆలయం, రాజగోపురం, తూర్పుద్వారం, ఉత్తరద్వారం, సభా మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. భక్తులు బసచేసేందుకు సత్రాలు సిద్ధం చేశారు. క్షేత్ర పరిసరాలలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదల తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.



నాచగిరి క్షేత్రం

నాచగిరి వద్ద హరిద్రనది వాగు



క్షేత్ర ప్రాశస్త్యం

నాచగిరిపై శేషశాయి మాదిరి గుహలో స్వామి స్వయంభుగా కొలువుదీరారు. క్షేత్రం ఎదుట పరవళ్లు తొక్కుతూ సాగిపోయే హరిద్రనది హల్దీ వాగు రమణీయ దృశ్యకావ్యంలా గోచరిస్తుంది. కొండ గుహలో కొలువైన శ్రీవారిని దర్శించుకుంటే శత్రుబాధ, భూత, ప్రేత, పిశాచ బాధలు తొలగిపోతాయని, దీర్ఘరోగములు నయమవుతాయని, కుటుంబ శాంతి, వివాహం, సంతానం సమకూరుతుందని భక్తులు విశ్వసిస్తారు.

ఉత్సవాలు ఇలా..

- 19న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- 20న ధ్వజారోహణం
- 21న శుక్రవారం రాత్రి 10 గంటలకు స్వామివారి తిరుకల్యాణోత్సవం
- 22న హంస వాహనసేవ
- 23న గజ వాహనసేవ
- 24న శేష వాహనసేవ
- 25న పెద్దగరుడసేవ
- 26న హనుమంతోత్సవసేవ
- 27న పొన్నవాహనసేవ
- 28న శుక్రవారం రాత్రి రథోత్సవం
- 29న తెల్లవారుజామున దివ్యవిమాన రథంపై స్వామివారి ఊరేగింపు, చక్రవరిన పూర్ణాహుతి
- 30న శతఘటాభిషేకం, ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుంది.

ఉత్సవాల కోసం విస్తృత ఏర్పాట్లు



స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. యాత్రికుల కోసం 45 సత్రాలు, 17 అతిథిగృహాలు సిద్ధం చేశాం. అదనంగా తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయిస్తున్నాం. ఆర్డీఓ చంద్రకళ దిశానిర్దేశంలో వివిధశాఖల అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు సేవలందిస్తున్నారు. ఉత్సవాలలో భక్తులు సంతోషంగా పాల్గొని తరించాలి.

- పార్నంది విశ్వనాథశర్మ, ఈఓ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, ప్రిన్సిపాల్ డా.సునీత

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉంటే అది వారి స్వయం అభివృద్ధి తోపాటు దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల కామర్స్ విభాగాధిపతి డాక్టర్ గోపాల సుదర్శనం రచించిన 'ఆర్థిక అక్షరాస్యత' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కళాశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ. ప్రస్తుత పరిస్థితుల్లో ఆదాయ వనరులు పెరిగినా, సరైన ఆర్థిక పరిజ్ఞానం లేక వెనుకబడుతున్నారన్నారు. ఆర్థిక సంస్థల విధి విధానాలు, పన్నులు, వాటి మదింపు పద్ధతులు, పొదుపు, పెట్టుబడి తదితర అంశాల గురించి రచయిత ఈ పుస్తకంలో వివరించారని ప్రశంసించారు. అధ్యాపకులు విద్యార్థులకు ఆర్థిక క్రమశిక్షణను, పొదుపు ప్రాధాన్యాన్ని బోధించాలని సూచించారు. అనంతరం పుస్తక రచయిత డాక్టర్ గోపాల సుదర్శనం మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతలో వెనుకబడిన వారు వ్యాపారాల్లో దివాలాతీసి, అప్పులుచేసి కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అందుకే సమర్థవంతమైన ఆర్థిక ప్రణాళిక, భద్రత గురించి ఈ పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.సునీత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మధుసూదన్, ఇంగ్లిష్ విభాగాధిపతి మామిడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గరిమా టీచర్ !

టెన్త్ విద్యార్థులకు 45 నిమిషాల పాటు బోధన

దుబ్బాక: నిత్యం ఎన్నో పనుల ఒత్తిడితో ఉంటే అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ లెక్కల టీచర్‌గా మారారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 45 నిమిషాల పాటు పదోతరగతి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్‌కు సంబంధించిన అంశాల గురించి బోధించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం పరిసరాలు, భోజనశాలను పరిశీలించారు. అన్నం మెత్తగా ఉండడంతో వెంటనే సివిల్ సప్లయ్ డీఎంకు ఫోన్‌చేసి నాణ్యమైన బియ్యం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీడీఓ భాస్కరశర్మ, ఎంఈఓ ప్రభుదాసు తదితరులు ఉన్నారు.

శతశాతం సాధించాలి

సిద్దిపేటరూరల్: బ్యాంకర్లకు వివిధ సెక్టార్లో ఇచ్చిన లక్ష్యాలను శతశాతం సాధించేలా బ్యాంకర్లు, అధికారులు సమష్టి కృషితో ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో బ్యాంకర్లు, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పథకాలు, కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను అమలు చేయాలన్నారు. జిల్లాలో మంజూరైన రుణాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. లక్ష్య సాధనలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని చెప్పారు. అనంతరం నాబార్డు జారీ చేసిన పొటెన్షియల్ లింకేజీ ప్లాన్ 2025–26 ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం హరిబాబు, డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్యా, నాబార్డ్ డీడీఎం నిఖిల్, యుడీఐ ఆర్‌ఎం వికాస్ తదితరులు పాల్గొన్నారు.



లెక్కలు బోధిస్తున్న గరిమా అగర్వాల్

ఓటుహక్కు నమోదు చేసుకోండి

18యేళ్లు నిండిన వారంతా ఓటుహక్కును నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటుహక్కు నమోదుకు నాయకులు సహకరించాలన్నారు. తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఆర్‌ఐ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తా..

అదనపు కలెక్టర్ హమీద్

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చెలుకలపల్లి గ్రామాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మంగళవారం సందర్శించారు. అనంతగిరి రిజర్వాయర్‌తో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం సరిగా లేదని, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామని వారు విన్నవించారు. అలాగే ఇళ్ల వద్దకు నీళ్లు వస్తున్నాయని, క్రిమికీటకాలతో భయంగా ఉందని చెప్పారు. బ్లాస్టింగ్‌లతో ఇళ్లకు బీటలు వారుతున్నాయని వాపోయారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేస్తామని హమీద్ వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ సదానందం, తహసీల్దార్ హరి కిరణ్, ఆర్‌ఐ మల్లికార్జున్ ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న హమీద్

దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు



సదరం సర్టిఫికెట్ స్థానంలో యూడీఐడీ కార్డులు

అర్హులైన దివ్యాంగులను వైకల్య శాతాన్ని బట్టి ఇప్పటి వరకు జారీ చేస్తున్న సదరం ధ్రువపత్రాలకు ప్రభుత్వం స్వస్తి పలకనుంది. వీటి స్థానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అంగవైకల్య యూడీఐడీ (యూనిక్ డిసెబుల్ ఐడెంటిటీ కార్డు) ను జారీ చేయనుంది. ఈ కార్డులను ఈ నెల నుంచి అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దివ్యాంగులు యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తున్న వివరాలతోపాటుగా వైద్యులు వైకల్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఎలాంటి తప్పులు జరిగేందుకు వీలు లేకుండా ఉంటుంది. 21 రకాల వైకల్యం కలిగి ఉన్న అర్హులైన దివ్యాంగులకు ఈ కార్డులను అందించనున్నారు. ఒకే దేశం ఒకే కార్డు విధానంలో ఈ కార్డు దేశం అంతటా పనిచేసేందుకు వీలు ఉండనుంది. – సిద్దిపేటరూరల్

- 3 రంగుల్లో అందించనున్న ప్రభుత్వం
- 21 రకాల వైకల్యం కలిగిన దివ్యాంగులు అర్హులు
- ఈ నెల నుంచి అమల్లోకి..
- పోర్టల్ ద్వారా దరఖాస్తులకు ఆహ్వానం
- జిల్లా వ్యాప్తంగా 1,86,000 మంది

ప్రస్తుతం సదరం సర్టిఫికెట్లు ఏడు కేటగిరీల్లో మాత్రమే అందించడం జరిగింది. మరో 14 కేటగిరీలను కలుపుకొని మార్చి నెల నుంచి యూనిక్ డిసెబిలిటీ గుర్తింపు కార్డులు 21 కేటగిరీల వారీగా అందించనున్నారు. యూడీఐడీ కార్డు కోసం ఎప్పటి మాదిరిగానే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే క్యాంపునకు హాజరు కావాలి. గతంలో మాదిరిగానే మీసేవా కేంద్రంలో గాని, ఫోన్‌లో గాని స్లాట్ బుక్ చేసుకొని క్యాంపునకు వెళ్లాలి. అనంతరం నిపుణులైన వైద్యులు పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తారు. దరఖాస్తు వివరాలు, వైకల్యశాతం, వైద్యుల లాగిన్‌కు చేరుతుంది. అక్కడ వివరాలు పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారి సంతకంతో కూడిన కార్డు మంజూరవుతుంది.

3 రంగుల్లో కార్డులు..

ప్రభుత్వం ప్రతీ శనివారం ఏర్పాటు చేయనున్న సదరం క్యాంపుల్లో వైకల్యం సంబంధించి వైద్యులు పరీక్షిస్తారు. అనంతరం పరీక్షల వివరాలు, లోపాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు, లోపాలను బట్టి వైకల్య శాతం జనరేట్ అవుతుంది. ఈ శాతాన్ని మార్చడానికి వైద్యులకు ఎలాంటి అవకాశం ఉండదు. ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ రూపొందించడం ద్వారా ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఈ శాతాన్ని అనుసరించి యూడీఐడీ కార్డులు మూడు రంగుల్లో ఇవ్వనున్నారు.

ఇప్పటికే ఉన్న ధ్రువపత్రం ఉపయోగం

సదరం క్యాంపులో భాగంగా వైకల్యం గుర్తించబడి శాశ్వతంగా పెన్షన్ మంజూరీకి ధ్రువపత్రాన్ని పొందిన వారు కూడా ఈ పోర్టల్ దరఖాస్తు చేసుకొని పర్మినెంట్ యూడీఐడీ కార్డును పొందేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న ధ్రువపత్రం అన్ని రకాలుగా వినియోగించుకునేందుకు వీలుంది.


సదరం క్యాంపు

పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి

దివ్యాంగులు యూడీఐడీ పోర్టల్ www.swavlambancard.gov.inలో సంబంధిత వివరాలతో ఆన్‌లైన్‌లో గాని, మొబైల్ ఫోన్‌లో గాని దరఖాస్తు చేసుకోవచ్చు. స్లాట్ ప్రకారం ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు పరీక్షలు నిర్వహించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఆటోమెటిక్‌గా వైకల్య శాతం జనరేట్ చేసి గుర్తింపు కార్డులు అందించడం జరుగుతుంది. చిరునామా వివరాలు నమోదు చేయడం ద్వారా ఇంటికే స్పీడ్ పోస్టు ద్వారా యూడీఐడీ కార్డు పంపించడం జరుగుతుంది. ప్రతీ వ్యవహారానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ ఫోన్‌కు సమాచారం అందించడం జరుగుతుంది. ఒక్కసారి కార్డు మంజూరైతే శాశ్వతంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. దేశంలో ఎక్కడికి వెళ్లినా ఈ కార్డు పని చేస్తుందని, రైళ్లు, బస్సుల్లో సైతం ప్రాధాన్యంతోపాటుగా పలు రకాల సౌకర్యాలను కూడా పొందవచ్చు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో పెన్షనర్ల వివరాలు

దివ్యాంగులు	– 13,793
వృద్ధులు	– 59,242
వితంతువులు	– 55,060
గీత కార్మికులు	– 2,942
చేనేత	– 2,206
హెచ్ఐవీ	–1,034
పైలేరియా	– 2,441
దయాలసిస్	– 103
ఒంటరి మహిళలు	– 3,417
బీడీ కార్మికులు	– 45,473
బీడీ టైకేదార్లు	– 2,078
మొత్తం పెన్షనర్లు	– 1,86,000

తప్పులు లేకుండా నమోదు



దివ్యాంగులు యూడీఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఫోన్‌లో గాని, మీసేవా కేంద్రంలో గాని ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా వివరాలు నమోదు చేయాలి. తప్పులను సరి చేయడానికి మళ్లీ అవకాశం ఉండదు. పోర్టల్‌లో సూచించిన విధంగా అవసరమైన వివరాలను బట్టి వైకల్యశాతం నమోదవుతుంది. తర్వాత మార్చడానికి వీలు ఉండదు. ఈ అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి.

జయదేవ్‌ఆర్యా,
జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు

పీఎం శ్రీతోపాటు మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి


అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ఐసీడీఎస్‌లను రద్దు చేయాలని తెచ్చిన పీఎం శ్రీపథకంతోపాటు మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ టీచర్లు పెద్ద ఎత్తున సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ.. దేశంతో పాటు రాష్ట్రంలో ఐసీడీఎస్ ప్రారంభమై 50 ఏళ్లు అవుతుందన్నారు. ఐసీడీఎస్‌ను, సేవలను సంస్థాగతం చేయాలని, ఇందులో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలను, మినీ టీచర్లను పర్మినెంట్ చేయాలని సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు ఆదేశాలిచ్చాయన్నారు. ఇలాంటి పరిస్థితిలో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూడటం అన్యాయమన్నారు. మొబైల్ అంగన్ వాడీ సేవల పేరుతో కొత్త విధానాన్ని తెచ్చి ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా కోశాధికారి జీ.భాస్కర్, సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీ, పద్మ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లోకి బాలుడు



మెడల్‌తో ధ్రువకరణ్ రెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో మూడున్నరేళ్ల ధ్రువకరణ్ రెడ్డి చోటు సంపాదించాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు తోట కరుణాకర్ రెడ్డి ప్రస్తుతం కొడిపల్లి నివాసం ఉంటూ మండలం పీర్యతండా ప్రాథమిక పాఠశాలలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. కరుణాకర్‌రెడ్డి, ప్రియాంక దంపతులకు కుమారుడు ధ్రువకరణ్ రెడ్డి(మూడున్నరేళ్లు), కూతురు ప్రవస్థ (2) ఉన్నారు. ధ్రువకరణ్ రెడ్డికి తల్లిదండ్రులు దేశంలోని వివిధ రాష్ట్రాలు, వాటి రాజధానులు, వివిధ దేశాల జాతీయ జెండాలు, నాయకుల పేర్లు, ఫ్లాష్ కార్డులు గుర్తింపులో ప్రత్యేక శిక్షణ ఇవ్వగా బొమ్మలు చూపగానే టక్కున గుర్తిస్తున్నాడు. గత నెలలో ధ్రువకరణ్ రెడ్డి దేశంలోని 28 రాష్ట్రాలు, వాటి రాజధానులను 46.58 సెకన్లలో గుర్తించగా వీడియో రికార్డు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుకు పంపించారు. పరిశీలించిన ప్రతినిధులు అతడి వయసు, సమయం ఆధారంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు కల్పించి సర్టిఫికెట్ పంపిణీ చేశారు. మెడల్, సర్టిఫికెట్ మంగళవారం అందించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి


పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

తొగుట(దుబ్బాక): అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఫారెస్ట్ బీటాఫీసర్ నరేశ్ కథనం మేరకు.. తొగుట పెట్రోల్ పంపు సమీపంలో నెమలి మృతి చెంది ఉందని గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లి నెమలిని పరిశీలించగా మరణించింది. స్థానిక పశు వైద్యాలయానికి తీసుకెళ్లగా పశువైద్యాధికారి రమేశ్ పోస్టుమార్టం నిర్వహించారు. తదుపరి నిర్ధారణ, ఆధారాల కోసం ఎఫ్‌ఎస్ఎల్‌కు పంపించామని అధికారి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నిజాంపేట(మెదక్): చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట మండలానికి చెందిన దండు చంద్రవ్వ కుమారుడు పదేళ్ల కిందట చనిపోయాడు. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుంది. మంగళవారం మధ్యాహ్నం నిజాంపేటకు చెందిన ఘడీం చెరువులో ఆత్మహత్యాయత్నం చేసింది. అటుగా వెళ్తున్న కుమార్ అనే వ్యక్తి గమనించి ఆమెను పైకి తీసుకొచ్చారు. వెంటనే 108కి సమాచారం అందించి రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

రంగనాయక సాగర్ వద్ద అగ్ని ప్రమాదం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ వద్ద గల ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం సమీపంలో మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రెండుగంట పాటు శ్రమించి మంటలార్పారు.

గొర్రెలు అమ్మేశారని మనస్తాపంతో..

బావిలో దూకి వృద్ధురాలు బలవన్మరణం

సిద్దిపేటకమాన్: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. స్థానిక నర్సాపూర్‌లో నివాసం ఉంటున్న బండారి పోశవ్వ (60) తమకు ఉన్న గొర్రెలను పెద్ద వాగు వైపు ప్రతి రోజూ తీసుకెళ్లి మేపేది. తమ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో గొర్రెలను అమ్మేయడంతో నిత్యం బాధపడుతుండేది. 16న భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం నర్సయ్య వ్యవసాయ బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. గొర్రెలు అమ్మడంతో మనస్తాపానికి గురై తల్లి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి


ఎల్లం (ఫైల్)

దుబ్బాకటౌన్ : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయపోల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానిక పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన గూని ఎల్లం (40) వ్యవసాయం, కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసై భార్య నవనీతతో గొడవ పడుతుండేవాడు. సోమవారం రాత్రి భార్యాభర్తలు గొడవపడ్డారు. కుటుంబ సభ్యులు రాత్రి భోజనం చేసి నిద్రించిన తర్వాత అర్ధరాత్రి సమయంలో ఎల్లం ఇంట్లో నుంచి వెళ్లి పొలం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

ఉరేసుకొని యువకుడు


గర్గుల భాను (ఫైల్)

నిజాంపేట(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గర్గుల రాజు, లలిత దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గర్గుల భాను(17) పదవ తరగతి పూర్తి అయిన తర్వాత గ్రామంలోనే కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులు వేరే గ్రామానికి వెళ్లగా భాను ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటిలో నుంచి శబ్దం రాకపోవడంతో పక్క ఇంట్లో ఉన్న స్నేహితుడు వెళ్లి చూశాడు. తాడుకు వేలాడుతున్న మిత్రుడిని చూసి ఇంటి తలుపులు పగులగొట్టి 108లో దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.


350 ఎకరాల్లో పంట ఎండిపోయింది

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో సుమారు 350 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని, మరికొన్ని రోజుల్లో ఇంకొందరి పొలాలు ఎండిపోయే స్థితిలో ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గీస భిక్షపతి వాపోయారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, రైతులతో కలసి మండల కేంద్రంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అసమర్థత వల్లే పంటలు ఎండుతున్నాయన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, నర్సింహులు, కిషన్, వంశీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం వాగ్వాదం

సిద్దిపేటరూరల్: పంటలు ఎండిపోతున్న క్రమంలో తమ గ్రామానికి నీటిని విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండల పరిధిలోని మాచాపూర్ రైతులు సిద్దిపేట కామారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా వస్తున్న సాగునీటిని నారాయణరావుపేట మండలానికి చెందిన కోండండరావుపల్లి, బంజేరుపల్లి గ్రామాల రైతులు అడ్డుకట్ట వేశారు. దీంతో మాచాపూర్ రైతులు తెలుసుకుని అడ్డుకట్టవేసిన రైతులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈఈ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. నీటిని మూడు గ్రామాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

అక్కాతమ్ముళ్లకు రెండేసి ఉద్యోగాలు


హారిక


శ్రీధర్

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్ పంచాయతీ కార్యదర్శి ఉల్లెంగుల హారిక వార్డెన్ ఉద్యోగం సాధించింది. అలాగే ఆమె తమ్ముడు శ్రీధర్ గ్రూపు -4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూపు-3లో 1600 స్టేట్‌ర్యాంక్ రావడంతో మంచి ఉద్యోగం వస్తుందని ఆశిస్తున్నాడు. గ్రూపు-1లో 441 మార్కులు సాధించిన శ్రీధర్‌కు ఎంపీడీఓ క్యాడర్ ఉద్యోగం కూడా వచ్చే అవకాశం ఉంది. అక్కన్నపేట మండలం కట్కూర్‌కు చెందిన ఉల్లెంగుల మల్లమ్మ హన్మయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఇద్దరు కొడుకులు. హన్మయ్య ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేసి పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. పెద్ద కూతురు స్వప్న స్త్రీనిధిలో అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగం చేస్తోంది. రెండో కూతురు హారిక పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూనే వార్డెన్ ఉద్యోగానికి ఎంపికైంది. కొడుకు శ్రీధర్ గ్రూప్స్ రాసి ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించడంతో తల్లిదండ్రులు పట్టలేని సంతోషంలో ఉన్నారు. అదేవిధంగా పందిల్ల గ్రామానికి చెందిన ఉప్పరపెల్లి సురేశ్ హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తూనే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలకు హాజరై ఆల్ ఇండియా 404 ర్యాంక్ సాధించి మల్టీ టాస్క్ స్టాఫ్‌కు ఎంపికయ్యాడు.

మల్లన్నసాగర్ సమస్యలపై కేసీఆర్‌కు లేఖ

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పోస్టు

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలపై మాజీ సీఎం కేసీఆర్ స్పందించాలని ముంపు గ్రామాలకు చెందిన యువకులు ఆయనకు బహిరంగ లేఖ రాశారు. గతేడాది డిసెంబర్ 16న లేఖ రాసి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించామని గుర్తు చేశారు. అయినప్పటికీ కేసీఆర్ నుంచి స్పందన లేదని మంగళవారం యువకులు ఒకచోట చేరి ఓ వీడియోను వాట్సాప్ గ్రూపుల్లో విడుదల చేశారు. తమ సమస్యలపై కేసీఆర్ అసెంబ్లీలో చర్చించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఫాంహౌజ్ ముట్టడిస్తామని పేర్కొన్నారు. మొత్తానికి ఈ పోస్టు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది.

రంజాన్ తోఫాలపై రాజకీయం చేయొద్దు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పవిత్రమైన రంజాన్ మాసంలో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న రంజాన్ తోఫాలపై తంజీం నాయకులు రాజకీయం చేయవద్దని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఆర్, మస్కటి డైరీ సంస్థకు చెందిన నిర్వాహకులు రంజాన్ తోఫాలను నిరుపేద ముస్లిం ప్రజలకు అందించాలని తంజీమ్‌కు అప్పగించారన్నారు. అయితే నిరుపేద ముస్లింలను గుర్తించి అందించాల్సింది పోయి, పక్కన పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, డీసీసీ జనరల్ సెక్రెటరీ మున్నా, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, సిద్దిపేట పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పొలానికి పరిహారమివ్వాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో ఎండిపోయిన వరి పొలాలకు ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారమివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రేగులపల్లెలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఎండిన పంటలను పరిశీలించారు. పరిశీలించిన వారిలో నాయకులు, రైతులు మల్లేశం, మహేందర్, శ్రీకాంత్, హరీశ్ ఉన్నారు.

గుట్కాల లారీ పట్టివేత

తూప్రాన్: అక్రమంగా పాన్ మసాలా లోడ్‌తో వెళ్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎంలో ఎలాంటి అనుమతులు లేని రూ.లక్షల్లో విలువైన సాగర్ (పాన్ మసాలా) గుర్తించామన్నారు. సుమారు 200 బస్తాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వాణిజ్య పన్నుల అధికారులకు సమాచారం అందించి డీసీఎంను అప్పగించామన్నారు.

చిరుతపులి సంచారం కలకలం

- రాయపోల్–తిమ్మక్కపల్లి శివారులో చూసిన రైతులు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు


రైతులు తీసిన చిరుతపులి ఫొటో

దుబ్బాక : రాయపోల్–తిమ్మక్కపల్లి గ్రామాల మధ్యనున్న గల్వాని చెరువు ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుందన్న సమాచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాయపోల్–తిమ్మక్కపల్లి గ్రామాల రైతులకు మంగళవారం గల్వానిచెరువు ప్రాంతంలో చిరుత పులి కనిపించింది. చిరుతపులి తిరుగుతున్న ఫొటోలను పలువురు రైతులు దూరం నుంచి సెల్‌ఫోన్‌లో తీసి పలు గ్రూపుల్లో షేర్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘుపతి వెంటనే అక్కడికి చేరుకొని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ ప్రాంతంలో సంచరిస్తుంది చిరుతనా..? లేక మరో జంతువా అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో రాయపోల్, తిమ్మక్కపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరుతపులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చిరుతపులి సంచారం వార్త రాయపోల్, తిమ్మక్కపల్లి గ్రామాల్లో తీవ్ర కలకలం లేపింది. ఆ ప్రాంతంలోని వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటేనే రైతులు భయపడుతున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


నరేశ్ (ఫైల్)

సంగారెడ్డి టౌన్ : మంజీరా గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్ కథనం మేరకు.. అందోల్ మండలం కుమ్మరిగూడెంకు చెందిన మ్యాదరి నరేశ్ (30) కొద్దిరోజులుగా భార్య దుర్గతో కలిసి ఇస్నాపూర్‌లో డ్రైవింగ్ పనిచేస్తూ అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఆదివారం తమ్ముడు నరేందర్, స్నేహితులతో కలిసి మంజీరా డ్యాంలో సరదాగా ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ నరేశ్ ఆవలి వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు రోజులకు యువకుడి మృతదేహం దొరికింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మహిళా సంఘాలకు టైలరింగ్‌లో శిక్షణ


శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

సంగారెడ్డి టౌన్ :మహిళా సంఘాల సభ్యులకు రాబోయే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫామ్‌లు అందేంచేందుకుగాను కుట్టు శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు సంగారెడ్డి ఏపీఎం వెంకటేష్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. సంగారెడ్డిలోని శిక్షణ కార్యాలయంలో కంది, సంగారెడ్డి, కొండాపూర్ మూడు మండలాల మహిళా సంఘం సభ్యులకు హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మహిళల ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

రూ.28.11 లక్షలకు తైబజార్ వేలం

గతేడాదితో పోలిస్తే రూ.9లక్షలు అధిక ఆదాయం

దుబ్బాకటౌన్: ఈ ఆర్థిక సంవత్సరానికి గాను తైబజార్, పశువుల అంగడి వేలం ద్వారా మున్సిపల్‌కు రూ.39.14 లక్షల ఆదాయం సమకూరిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కూరగాయల తైబజార్, పశువుల అంగడి తైబజార్ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల (మేకల, గొర్రెల) అంగడికి నిర్వహించిన వేలంలో రూ.28.03 లక్షలకు నార్కట్‌పల్లికి చెందిన దూదిమెట్ల వెంకటేశ్వర్లు, కూరగాయల తైబజార్‌కు నిర్వహించిన వేలంలో రూ.11.11 లక్షలకు దుబ్బాకకు చెందిన కిష్టమ్మగారి సుధాకర్ రెడ్డి పాటను దక్కించుకున్నారన్నారు. గత యేడాదితో పోలిస్తే రూ.9లక్షల ఆదాయం పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది ప్రవీణ్, జ్యోతి, మధుసూదన్, రామస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

శుభకార్యానికి వచ్చి బావిలో పడి యువకుడు మృతి

సిద్దిపేటరూరల్: బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండల మాచాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అపూర్వ రెడ్డి కథనం మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన జంగా సందీప్ (23) రెండు రోజుల కిందట మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలో బంధువుల ఇంట్లో గృహప్రవేశం కోసం వచ్చాడు. మంగళవారం అదే గ్రామానికి చెందిన సంకటి వెంకటి వ్యవసాయ బావి వద్దకు స్నానం చేయడానికి వెళ్లగా ప్రమాదశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. నీటిలో మునిగి పైకి తేలకపోవడంతో గజ ఈతగాళ్లకు సమాచారం అందించారు. కాసేపు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.